## 42 ప్రాతస్తవము

రా – కాంభోజి తా – కురుఝంపె

తెల్లవారిన వేళఁ – దెలి వొంది మన క్రీస్తు – దివ్య నామముఁ బాడరె – యో ప్రియులార – దివస రక్షణ వేఁడరే = తల్లి రొమ్మున దాఁచు – పిల్ల రీతిని మనలఁ జల్లదనముగ రాతి – రెల్లఁ గాచిన విభునిఁ ॥దెల్లవారిన వేళ॥

1. నిద్రపోయిన వేళ – నిఖిలాపదులఁబాపి – నిశ లన్ని గడుపు విభునిన్ = భద్రముగ వినతించి – భయభక్తితో మనము – ముద్రి తాక్షులఁ గేలు – మోడ్చి మ్రొక్కుమను ॥దెల్లవారిన వేళ॥
2. భానుఁ డుదయం బయ్యెఁ – బద్మములు వికసిల్లె – గానములు జేసెఁ బక్షుల్ = మానసాబ్జము లలర – మనము కల్వరి మెట్ట – పై నెక్కు నినుఁ డనెడి – ప్రభుఁ జూచి వేడ్కన్ ॥దెల్లవారినవేళ॥
3. దిట్టముగ మానసేం – ద్రియ కాయ శోధనలు – పట్టుకొని,యుండు దినమున్ = దట్టముగ మన నాల్గు – తట్ల యేసుని కరుణఁ జుట్టుకొని రక్షించు – శుభ మదుగుకొనుచున్ ॥దెల్లవారిన వేళ॥
4. పాప భారము మనము – ప్రభుని పై నిడి గురుని – పాదములు చెంత నొరగి – కాపు కర్త విశాల – కరము మాటున డాఁగి – యాపదలఁ దొలఁ గించు – మని వేఁడుకొనుచున్ ॥దెల్లవారిన వేళ॥

– పురుషోత్తము చౌధరి

## 43 ప్రాతఃకాల స్తుతి

రా – యమునాకళ్యాణి తా – రూపకము

శ్రీ యేసు కర్తను – సేవఁ జేయుటకు మేల్కొను – శ్రీయేసు కర్తను = శ్రేయముల నెఱింగి – నీకు రేయిపవ లొసంగి – యెడఁ – బాయని యంత రంగి – య – పాయంబుఁ ద్రోయ స – హాయంబుఁజేయ ॥శ్రీ యేసు॥

1. నిదురయందు నేఁడు – క్షేమ – మొదవఁ గాచినాఁడు – సూర్యుఁ – డుదయ మాయెఁజూడు – నీ – హృదయమున సదమల – పదవులుదయింప ॥శ్రీ యేసు॥
2. అంధకార మణఁగెన్ – హృద – యాంధకార మణఁగన్ – ప్రభు – నందుఁ దెలివి గలుగన్ ని – బంధనలు డెందమున – కందముగఁ గూర్చి ॥శ్రీ యేసు॥
3. కంటిపాప వలెను – నిను – గాయువాని దయను – గనుఁ – గొంటివి స్తోత్రమును – జేయు – మింటి కినిమంటిక–న్నింటికిని కర్త యని॥శ్రీ యేసు॥
4. కలకల ధ్వనిఁజేయు – పక్షి – గములు లయను గూయు – స్వర – ములు ప్రభు స్తుతిఁజేయు – నీ – వలయక సొలయక – వెలయఁగఁ బాడు ॥శ్రీ యేసు॥
5. సేవయందు నీకు – మంచి – యీవు లిడుపరాకు – గల – భావముఁబడఁ బోకు – నేఁడుఁ – కానవే కావవే – కావవే యంచు ॥శ్రీ యేసు॥
6. పగటివార మంచు – ని – ష్ఫలపు గ్రియలు ద్రుంచు – యుగ – యుగములు జీవించు – పురి – కెగయ నీ దిగులు విడు – తగు నమ్మకమున ॥శ్రీ యేసు॥
7. మింటి నంటఁ బాడు – నీ – యొంటి బలిమి నేఁడు – ప్రభు నంటియుండ వాఁడు ని – న్నొంటి నెన్నంటి కె – న్నింటికి న్వీడఁడు ॥శ్రీ యేసు॥

– బేతాళ జాన్

## 44 ఉదయారాధన

రా – బిలహరి తా – అట

సకల జగజ్జాల కర్తా – భక్త – సంఘ హృదయ తాప హర్తా యకలంక గుణమణి – నికర పేటీ కృత – ప్రకట లోకచయ – పరమ దయాలయ ॥సకల॥

1. నాదు నెమ్మది తొలఁగించుచుఁ – బ్రతి – వాదు లీమెయి నెంతో పాదుకొన్నారు – బాధలందైనను –సాధులఁబ్రోవ న – నాది యైనట్టి నీ – వాధారమైయుండ ॥సకల॥
2. దినకృత్యములఁ గష్టమంత – చీఁక – టిని నే నీ కడ భక్తి – మనవిజేయ = వినుచు నా కష్టము – వెస నష్టముగఁ జేయ – ఘనముగ నాయందుఁ గరుణఁ జేసితివి ॥సకల॥